క్లుప్తంగా

ముగిసిన శ్రీరామ నవమి వేడుకలు



బ్రాహ్మణగూడెంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

నిడదవోలు రూరల్: ఉనకరమిల్లిలో సీతారామ కల్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని భారీ అన్నసమారాధనను ఆదివారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సీతారామమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు.

బ్రాహ్మణగూడెంలో ..

చాగల్లు: శ్రీరామ నవమి వేడుకలు ముగింపు సందర్భంగా బ్రాహ్మణగూడెంలో ఆదివారం సాయంత్రం భారీ అన్న సమారాధన నిర్వహించారు.రామాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనలో ఎస్ ముప్పవరం, గరప్పాడు, దారవరం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాలా త్రిపుర సుందరికి పంచామృతాభిషేకం

ఉండ్రాజవరం: గ్రామంలోని శ్రీబాలా త్రిపుర సుందరి సమేత శ్రీగోకర్ణేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సహస్ర నామ కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మద్దిరాల వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు అనంతరం లలితా సహస్ర పారాయణ నిర్వహిస్తామన్నారు.

కోటసత్తెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



కోటసత్తెమ్మ నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న దాతలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రారంభించిన మజ్జిగ చలివేంద్రానికి కొత్త త్రిమూర్తులు జ్ఞాపకార్థం తులసీరామకృష్ణ 100 లీటర్ల పెరుగును అందజేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల విక్రయంతో రూ.1,75,164 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. అమ్మవారి నిత్యాన్నధాన కార్యక్రమానికి విజయవాడకు చెందిన ఎం.అనిల్‌కుమార్, రజనీకాంత్ రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యం

ఉండ్రాజవరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత సంస్థ లక్ష్యమని మానవత మండల అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు అన్నారు. మండలంలో చివటం గ్రామానికి చెందిన నీలం తులసమ్మ ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి, నిలువ నీడ లేకపోవడంతో కూతురు ఇంటిలో ఉంటోంది. విషయం తెలుసుకున్న సిద్ధార్థరాజు ఆదివారం తులసమ్మకు రూ. 5 వేలు నగదు, బస్తా బియ్యం అందజేశారు. అనంతరం వడ్లూరు గ్రామానికి చెందిన దొంగ వెంకటేశ్వరరావుకు రూ.1,000 నగదును అందజేశారు. చివటం ఎంపీటీసీ సభ్యుడు వేముల వెంకటసత్యనారాయణ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో వడ్లూరు వైఎస్సార్ సీపీ నాయకులు రఘుమండ శ్రీనివాసు, ముమ్మిడి రాధాకృష్ణ పాల్గొన్నారు.

పీఎం శ్రీ అభివృద్ధి పనులకు అవినీతి సెగ

- పీఎం శ్రీ అభివృద్ధి పనుల్లో కొరవడిన నాణ్యత
- రూ.5 లక్షలతో తూతూ మంత్రంగా క్రీడా కోర్టుల ఏర్పాటు
- రూ.15.58 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణం
- సమిశ్రగూడెం జెడ్పీ హైస్కూల్లో నత్తనడకన పనులు



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పీఎం శ్రీ నిధులతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్ భవనం



క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు వేసిన నాసిరకం మట్టి

నిడదవోలు రూరల్: పీఎం శ్రీకి అవినీతి సెగ తగిలింది.ఈ పథకంలో చేపట్టిన స్కూలు అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి స్కూల్ ఆఫ్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పనుల్లో అక్రమార్కులు నాణ్యతకు తిలోదకాలిచ్చి తమ జేబులు నింపుకుంటున్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ నిధులు మంజూరు చేసి పలు అభివృద్ధి పనులు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో నిర్మాణం చేపట్టిన పనులు పూర్తికాకుండా పగుళ్లు ఏర్పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేరెంట్స్ కమిటీకి



క్రీడా కోర్టుల బేస్‌మెంట్ గోడకు పగుళ్లు

నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఆ పనుల నాణ్యతను అడిగేవారు లేకపోవడంతో నాసిరకంగా పనులు జరుగుతున్నాయి.

నైపుణ్యాలు పెంచేందుకు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాలు పెంచేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, మౌలిక సదుపాయాల ఆధారంగా పాఠశాలలను ఎంపిక చేసి కార్పొరేటు బడులకు దీటుగా పలు సౌకర్యాలను కల్పించేందుకు నిధులు వెచ్చిస్తోంది. సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.15.58 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్ భవనాన్ని నిర్మిస్తున్నారు. రూ.లక్షతో దివ్యాంగులు వెళ్లేందుకు అనువుగా ర్యాంపు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇనుము వాడకుండానే ర్యాంపు నిర్మాణం చేపట్టడంపై నాణ్యత తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటు

పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా జెడ్పీ హైస్కూల్లో రూ.5 లక్షలతో వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ కోర్టులను నిర్మాణం చేపట్టారు. నాణ్యమైన మట్టి వేయకపోవడంతో రాళ్లు దర్శనమిస్తున్నాయి. ప్రాంగణం చుట్టూ ఏర్పాటుచేసిన బేస్‌మెంట్ గోడలకు పగుళ్లు వచ్చాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వానంగా కోర్టులు ఏర్పాటు చేస్తున్నారని క్రీడాకారులు వాపోతున్నారు.

పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి వనిత

నల్లజర్ల: అనంతపల్లి, అచ్చన్నపాలెంలో పలు కుటుంబాల వారిని మాజీ హోంమంత్రి, పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు తానేటి వనిత ఆదివారం పరామర్శించారు. ఎంపీపీ బంక జయలక్ష్మి ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వనిత అడిగి తెలుసుకున్నారు.అదే గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత ప్రత్తి శ్రీనుబాబు ఒక దాడిలో గాయపడ్డాడు. వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేసారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కార్యకర్త మద్రి మహేష్‌ను, అనారోగ్యంతో ఉన్న మరో కార్యకర్త ములగాల గోపిని ఆమె పరామర్శించారు. ఇటీవల తల్లి మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వలిరెడ్డి అర్జున్‌ను పరామర్శించారు. కిమిడి చిన అప్పారావు భార్య సుబ్బలక్ష్మి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను వనిత పరామర్శించారు. అచ్చన్నపాలెంలో వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరావు పెద్దమ్మ ఇటీవల మృతి చెందారు.వారి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఆమె



అనంతపల్లిలో ఎంపీపీ బంక జయలక్ష్మిని పరామర్శిస్తున్న మాజీ హోంమంత్రి వనిత

వెంట మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, నాయకులు బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీరావు, యడ్లపల్లి మార్త, యజ్ఞవరపు లక్ష్మి, నక్కా పండు, చిన్ని నాగూయాదవ్, జాలాది రవి, తాడిగడప శ్రీనివాసరావు, తోట వెంకట్రావు, అచ్యుత వెంకటస్వామి, ప్రత్తి మురళీకృష్ణ, జాదుల దుర్గారావు, లైటింగ్ పండు, వీరమళ్ల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

నిడదవోలు: స్థానిక యర్నగూడెం రోడ్డులో వెల్డింగ్, ఐరన్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడు తీపర్తి వీర్రాజు మాట్లాడుతూ వెల్డింగ్ కార్మికులు తమ జీవనోపాధి కోసం ప్రమాదకరమైన పని చేస్తున్నారు. వీరి సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మ కుమార్ మాట్లాడుతూ వెల్డింగ్, భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు సంక్షేమ మండలిలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న తీపర్తి వీర్రాజు

తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో గాలి గని రాజు, మోర్త పాసియ్య, మెరిసే గంగాధర్ పాల్గొన్నారు.

పిల్లలకు విద్యను వారసత్వంగా ఇవ్వాలి

గోపాలపురం: పిల్లలకు విద్యను వారసత్వంగా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపైనా ఉందని ఎంఈవో జి.శ్రీనివాసరావు అన్నారు. గోపాలపురం మండలం గుడ్డిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ గుడికి మొక్కినట్లే బడికీ మొక్కాలని పిల్లలకు చదువును వారసత్వంగా ఇవ్వాలని ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యతో పాటు ఆధునిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ మడిచర్ల ప్రసాద్, ఎంపీటీసీ బొర్రా ఆంజనేయులు, మాజీ సర్పంచ్ ఆకుల



గుడ్డిగూడెం ఎంపీయూపీ పాఠశాల శతాబ్ది వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంఈఓ

రాము, ఎస్ఎంసీ చైర్మన్ మెంటి సరోజిని, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు



కానూరులో విద్యార్థులు, అధికారులతో నవోదయం-2 కార్యక్రమంలో ప్రారంభిస్తున్న దృశ్యం

పెరవలి: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా భావి భారత పౌరులుగా ఎదగాలంటే ప్రతి ఒక్కరికీ లక్ష్యం ఉండాలని నిడదవోలు ఎక్సైజ్ సీఐ జైరామ్ సతీష్ తెలిపారు. పెరవలి మండలం కానూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆయన విద్యార్థులు, గ్రామ పెద్దలతో కలసి నవోదయం -2 కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేసి వారు సన్మార్గంలో పయనించేలా చేయటమే తమ లక్ష్యమన్నారు. ప్రస్తుతం యువకులు ఎక్కువగా మద్యం, నాటుసారా, గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి అలవాటు పడుతున్నారని దీని వలన వారి ఆరోగ్యం పాడవ్వటమే కాకుండా, వారి కుటుంబాలు ఆధారం కోల్పోతారని తెలిపారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బావన మధు, ఎంపీటీసీ సభ్యుడు కోలా లక్ష్మీ సీతయ్యనాయుడు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: ఉచిత వైద్యశిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథం అన్నారు. ఆదివారం హుకుంపేట పంచాయతీ ఎదురుగా కేపీఆర్ వాటర్‌ప్లాంట్ ఆవరణలో కోటంశెట్టి వెంకాయమ్మ, పెంటారావు, అప్పలనర్సమ్మ జ్ఞాపకార్థం కేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోటంశెట్టి రాజబాబు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను ప్రారంభించారు. అనంతరం రక్తదాతలను అభినందించి, ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్న రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ మృతి చెందిన కుటుంబ సభ్యుల పేరున కేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోటంశెట్టి రాజబాబు ఉచిత మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్యులు వీఎన్‌వీఆర్ సతీష్, కె.చాందిని, వీఎస్‌పాపారావు, శ్రీరామ్‌సుధంశెట్టి, ప్రణీతశెట్టి వివిధ సమస్యలకు పరీక్షలు చేసి మందులు అందించారు. సత్యసూర్య వాలంటరీ బ్లడ్‌బ్యాంక్ అండ్ బ్లడ్ కాంపోనెంట్స్ వారిచే రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో 108 మంది సేవలు పొందారు.

తోట త్రిమూర్తులుకు అభినందనలు



తోట త్రిమూర్తులును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీని బలోపేతం చేయటంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమించిన సందర్భంగా ఆయన్ను ఆదివారం వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. త్రిమూర్తులు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, తాళ్లపూడి మండలం కాపు సంఘం అధ్యక్షుడు నామ ప్రకాశం తదితరులున్నారు.

అనాథాశ్రమానికి విరాళం అందజేత



భీమోలు లూథరన్ చర్చిలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ కాకులపాటి లలిత

గోపాలపురం: గోపాలపురం జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని భీమోలు లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం 100 మంది వృద్ధులు, వికలాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం దేవరపల్లి మండలం గొల్లగూడెం అనాథ ఆశ్రమంలోని దివ్యాంగులకు, అనాథలకు, వృద్ధులకు అన్నసమారాధన చేపట్టారు. అనంతరం అనాథాశ్రమానికి రూ.10 వేల నగదు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు లలితకు మాజీ హోం మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ ఉమ్మడి జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌లు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, కమిడి జగన్, బిల్‌గేట్స్, లూథరన్ చర్చి ఫాదర్ శ్యామ్యూల్, కాకులపాటి శ్రీనివాసు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.


అకాల వర్షంతో పంటలకు నష్టం



దేవరపల్లిలో ఆదివారం రాత్రి కురుస్తున్న వర్షం

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో బలమైన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురవడంతో పంటలు దెబ్బతిన్నట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలలో మూడు సార్లు అకాల వర్షం కారణంగా రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న పంటలు తడిసి రంగు మారుతున్నట్టు రైతులు తెలిపారు. ఆదివారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం దంచి కొట్టింది. గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలు గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. గౌరీపట్నం, దుద్దుకూరు, బందపురం, యర్నగూడెం, సూర్యనారాయణపురం, కృష్ణంపాలెం గ్రామాల్లో రోడ్లపై ఎండబెట్టిన ధాన్యం తడిసింది. ధాన్యం రాసుల అడుగు భాగం నుంచి నీరు పారడంతో ధాన్యం తడిసి ముద్దయినట్టు రైతులు తెలిపారు. మామిడి, జీడిమామిడి, అరటి, బొప్పాయి వంటి పంటలకు నష్టం వాటిల్లినట్టు రైతులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో 'మట్టల ఆదివారం'



ఖండవల్లిలో ఈత మట్టలతో చిన్నారుల ఊరేగింపు



నిడదవోలులో మట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఈత మట్టలతో చిన్నారుల ఊరేగింపు

నిడదవోలు: క్రైస్తవుల తమ ఆధ్యాత్మిక జీవితాభివృద్ధికి, అత్యంత ఆవశ్యకమైన శ్రమ దినాల్లో వచ్చే మట్టల ఆదివారాన్ని (పామ్ సన్ డే)ను నియోజకవర్గంలో చర్చిల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో మెంటే సుందరరావు మెమోరియల్ లూథరన్ టౌన్ చర్చిలో చైర్‌పర్సన్ మెంటే దయారాజగిరి ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వాసులు, సంఘస్తులు, యువజనులు వివిధ పుష్పాలతో అలంకరించిన ఈత మట్టలతో నినాదాలు చూస్తూ ఊరేగింపు నిర్వహించనున్నారు. స్థానిక రైల్వేసెంటర్‌లో చర్చి పాస్టర్ రెవ. కె.కమలాకర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బేబి కమలాకర్, సుజ్ఞానరాజు, కె.షర్మిల, ఎం.మల్లయ్య, డి.విజయకుమార్, ఎం.ప్రవీణ్, సుహన్‌రాజ్ ఐజాక్, జ్ఞానకుమారి, రాజ్యలక్ష్మి తనూజ పాల్గొన్నారు.

కృపాధార సెంటినరీ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బయ్యే ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. సహాయక పాస్టర్ రెవరెండ్ విపర్తి శాంతిప్రకాష్, కోశాధికారి డొంకా విజయ్ పాల్గొన్నారు.

పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు

పెరవలి: క్రైస్తవులు పరమపవిత్రంగా భావించే మట్టల ఆదివారాన్ని పిల్లలు, పెద్దలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవ విశ్వాసులు ఈత మట్టలను పట్టుకుని గ్రామంలో ఊరేగారు. పెద్దలు మట్టలు పట్టుకుని శ్మశాన వాటిక వద్దకు వెళ్లి తమ పూర్వీకుల సమాధులపై కొవ్వొత్తులు వెలిగించి, మట్టలను సమాధుల చుట్టూ గుచ్చి నివాళులర్పించారు.



దేవరపల్లిలో మట్టలతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

బ్రాహ్మణగూడెంలో ప్రార్థనలు

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో బైబిల్ మిషన్ ప్రార్థన మందిరం పాస్టర్ ఎస్ దేవదాసు, శ్యాంబాబు ఆధ్వర్యంలో విశ్వాసులు, చిన్నారులతో గ్రామం పురవీధుల్లో గుండా తిరుగుతూ ప్రార్థనలు చేశారు. చాగల్లు, ఊనగట్ల, మార్కొండపాడు, చిక్కాల, దారవరం గ్రామాల్లో చర్చిల్లో మట్టల ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

లూథరన్ చర్చి, బైబిల్ మిషన్ చర్చిల్లో..

ఉండ్రాజవరం: మట్టల ఆదివారం పండుగను మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉండ్రాజవరం లూథరన్ చర్చి, బైబిల్ మిషన్ చర్చితో పాటు తాడిపర్రు, చివటం, వేలివెన్ను, కాల్ధారి, మోర్త, పాలంగి గ్రామాల్లో ఆలయాల్లో ఈత మట్టలకు పూలతో అలకరించారు. ఉండ్రాజవరం లూథరన్ చర్చి పాస్టర్ ఆర్.ఇజ్రాయిల్ మాట్లాడుతూ మట్టల ఆదివారం విశిష్టతను వివరించారు. ముందుగా మట్టలు చేతపట్టుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

దేవరపల్లి: ఈస్టర్‌కు ముందు వచ్చే మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు దేవరపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈత ఆకులకు అలంకరణ చేసి పురవీధుల్లో ప్రార్థన చేస్తూ ప్రదర్శన చేశారు. మట్టల ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు. క్రైస్తవ దేవాలయాల్లో ప్రార్థనలు నిర్వహించారు.

విజయోత్సవ ర్యాలీలు

నిడదవోలు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని ఆర్సీఎం, బెతేస్థ ప్రార్థన మందిరం, బైబిల్ మిషన్, పెంతుకోస్తు చర్చిల్లో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో సంఘ విశ్వాసులు హోసన్నా విజయోత్సవ ర్యాలీలు చేశారు. సమిశ్రగూడెం, పురుషోత్తపల్లి, శెట్టిపేట, పెండ్యాల, డి.ముప్పవరం లోని పలు దేవాలయాల్లో ప్రార్థనలు నిర్వహించారు.